ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply

సోమవారం 17-08-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :60 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్




# ఇంటర్ బోర్డులో అక్రమాల రచ్చ!

- ఫేక్ సర్టిఫికెట్లతో కొలువులు
- మెమోల మార్పిడితో మాయ
- అధికారుల అండతో అక్రమాలు
- 98 శాతం మెమోతో ఎంట్రీ
- 53 శాతంతో రెగ్యులరైజేషన్
- ఫైళ్లలో మెమోల గోల్‌మాల్
- ఆర్టీఐ సమాచారానికి నో
- చర్యలపై విద్యార్థుల డిమాండ్

**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖలో కలకలం రేపుతున్న నకిలీ లెక్చరర్ల వ్యవహారంలో బోర్డులోని ఉన్నతాధికారుల పాత్రపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్హత లేని వ్యక్తులు, నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వారు ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లుగా ఏండ్ల తరబడి కొనసాగడం వెనుక ఇంటర్ బోర్డు అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2023 వరకు ఆర్జేడీగా ఉన్న ఒక అధికారి అండదండలతోనే నకిలీ లెక్చరర్ల వ్యవహారం జోరుగా సాగిందనే విమర్శలున్నాయి. ఈ వ్యవహారంలో సదరు లెక్చరర్లు అసలు విద్యార్హతలే లేకుండా ఉద్యోగాల్లో చేరగా, మరికొందరు ఇతర రాష్ట్రాల యూనివర్శిటీలలో పీజీలు చేసినట్టు సర్టిఫికెట్లు సంపాదించి ఉద్యోగాలు పొందారు. వీరికి అంతా నేను చూసుకుంటాను అని సదరు అధికారి హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు నకిలీ లెక్చరర్లు, ఫైర్ ఎన్వోసీలు, రెండు ఇంక్రిమెంట్ల వ్యవహారం బయటపడడంతో విచారణకు కమిటీలు వేసినట్టు తెలుస్తోంది.

# కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్

- సోనియాపై అమిత్ షా విరుచుకుపాటు
- వందేమాతరంపై రాజకీయ దుమారం
- కాంగ్రెస్ నేతలకు షా చురకలు
- సోనియా క్షమాపణ చెప్పాలన్న షా
- వందేమాతరం వివాదంపై వార్
- బీజేపీపై కాంగ్రెస్ ఎదురుదాడి



**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన అంశంపై వివాదం రాజుకుంది. రాజస్థాన్‌లోని చిత్తొడ్‌గఢ్ లో జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ టార్గెట్‌గా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. ఢిల్లీలోని కాంగ్రెస్ హెడ్‌క్వార్టర్స్‌లో జాతీయ గీతం వందేమాతరం ఆలపిస్తుండగా, మధ్యలోనే ఆపేయాలని సోనియా గాంధీ పార్టీ అధ్యక్షుడికి సూచించారని అమిత్ షా ఆరోపించారు.

2 లో

# రెట్రోఫిట్ స్కీమ్‌పై పొన్నం ప్రకటన

- ఆటోలకు రూ.1.50 లక్షల సబ్సిడీ
- ఆటో యజమానులకు రెండు ఆప్షన్లు
- ఈవీ ఆటోల వైపు అడుగు
- ఆటో డ్రైవర్లకు ఆర్థిక ఊరట
- హైదరాబాద్‌కు కాలుష్య రహిత రవాణా
- ఈవీ మార్పిడికి రూ.200 కోట్ల స్కీమ్


2 లో

**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా క్యూర్ ప్రాంతంలోని అర్హత కలిగిన ఆటో యజమానులందరికీ ఈ రూ.1.50 లక్షల సబ్సిడీ పథకం అమలు చేస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛమైన, సుస్థిరమైన, పర్యావరణహిత ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో " తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ మార్పిడి పథకం - 2026 " ను రూపొందిస్తున్నామని తెలిపారు. నగరంలో ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను ఈవీలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్ అమలుకు ఇటీవల తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ పథకంపై ఆదివారం మంత్రి పొన్నం కీలక ప్రకటన చేశారు.

యజమానులకు రెండు చాన్సులు:

అర్హత కలిగిన ప్రతి ఆటో యజమానికి రెండు అవకాశాలు కల్పిస్తున్నామి..

# బీసీ కులగణనపై పొన్నం ఫైర్


2 లో

- బీసీ జనాభా లెక్కలకు ప్రత్యేక కేటగిరీ
- మోదీకి మంత్రి పొన్నం కీలక డిమాండ్
- కులగణన ప్రశ్నను చేర్చాలని లేఖ
- తెలంగాణ సర్వే అనుభవాన్ని పరిగణించండి

# ప్రియాంక కేసుపై సర్కార్ ఫోకస్


2 లో

- ప్రియాంక కేసు దర్యాప్తుకు ఐపీఎస్ అధికారి
- పాటిల్ దేవరాజుకు విచారణ బాధ్యతలు
- అన్ని కోణాల్లో ఆధారాల సేకరణ
- వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశం
- నిందితులకు కఠిన శిక్షే లక్ష్యం

# టీఎంసీ కార్యాలయంలో ఆత్మహత్య


2 లో

- పార్టీ కార్యాలయంలోనే మాజీ డిప్యూటీ స్పీకర్ బలవన్మరణం
- ఆశిష్ బెనర్జీ మృతితో బెంగాల్‌లో సంచలనం
- ఉరేసుకుని కనిపించిన టీఎంసీ సీనియర్ నేత
- ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ కలకలం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కీలక నేత

# తెలంగాణలో కల్తీ, నకిలీలకు చెక్

- కల్తీ, నకిలీలపై 'TG SAFE' ఉక్కుపాదం
- ఫుడ్, డ్రగ్స్ శాఖలు ఒకే గొడుగు కిందకు
- ఆరు విభాగాలతో ఉమ్మడి పరిపాలన
- సీనియర్ ఐపీఎస్ అవినాశ్ మహంతికి బాధ్యతలు
- తొలుత క్యూర్ రీజియన్‌లో తనిఖీలు



2 లో

**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్రంలో ఆహార భద్రత ప్రమాణాలను పటిష్టం చేయడం నకిలీ, నాణ్యత లేని మందులు, ఆహార పదార్థాల విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్, డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్‌లను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ టీజీ సేఫ్ పేరుతో ఉమ్మడి పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా చోంగ్తూ జీవో నెం.67ను జారీ చేశారు. అయితే, ఈ ఉత్తర్వులు ఆగస్టు 15 నుంచి అంటే నిన్నటి నుంచే అమల్లోకి వచ్చాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940ల పరిధిలోని చట్టబద్ధ అధికారాలకు ఎలాంటి భంగం కలగకుండా ఈ విలీనం జరిగినట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి.

ఉమ్మడి పాలనలో 6 ప్రత్యేక విభాగాలు

ఇక 'టీజీ సేఫ్' కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అవినాశ్ మహంతిని నియమిస్తూ ఉత్తర్వులు వెలవడ్డాయి. ఆయన ఆ సంస్థకు పూర్తి ఉమ్మడి పరిపాలనా నియంత్రణ అధికారిగా వ్యవహరించున్నారు. 'టీజీ సేఫ్' పరిధిలో 6 కీలక విభాగాలు పనిచేస్తాయి. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 కింద లైసెన్సులు, తనిఖీలు, శాంపిళ్ల పరీక్షలు, దర్యాప్తు బాధ్యతలను డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ వింగ్ చూసుకుంటుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 కింద లైసెన్సులు, నమోదు, తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బాధ్యతలను ఫుడ్ సేఫ్టీ వింగ్ నిర్వహిస్తుంది. నిఘా సమాచారం సేకరణ, ప్రమాదకర తనిఖీల కోసం పోలీసు శాఖ నుంచి కేటాయించే సిబ్బందితో ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పనిచేస్తుంది.

# యూరప్‌లో హీట్ వేవ్..

- ఒక్క వారంలోనే 16 వేల మంది మృతి
- 37 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియంపై తీవ్ర ప్రభావం
- వేడిగాలులతో ఆరోగ్య సంక్షోభం
- 2022 నాటి మరణాల స్థాయిలోనే విషాదం
- గ్లోబల్ వార్మింగ్‌తో పెరుగుతున్న ముప్పు

# మేడారం నుంచి సంక్షేమ శుభారంభం

- కొత్త పింఛన్లకు శ్రీకారం
- సీఎం రేవంత్ కీలక పర్యటన
- మహిళలకు ఆసరా చేయూత
- మేడారం అభివృద్ధికి భారీ నిధులు
- మేడారంలో సీఎం అభివృద్ధి పర్యటన
- భక్తుల కోసం వాటర్ ప్లాంట్



**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** సమ్మక్క-సారలమ్మ వనదేవతల దివ్య ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రంలో కొత్త సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పర్యటన ద్వారా శ్రీకారం చుట్టారు.

కొత్త పింఛన్ల పంపిణీ:

రాష్ట్రంలోని అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలకు నూతనంగా ఆసరా పింఛన్లు అందించే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని మేడారం పవిత్ర పుణ్యక్షేత్రం నుంచే సీఎం లాంఛనంగా ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో అర్హులైన 24 మంది వితంతువులు, ఒంటరి మహిళలకు

2 లో

# వందేమాతరం ఏ పార్టీ సొత్తు కాదు

- వందేమాతరం వివాదంపై సోనియాకు వారసుడి లేఖ
- క్షమాపణ చెప్పాలని సుమిత్రో ఛటర్జీ డిమాండ్
- చారిత్రక తప్పు పునరావృతమైందంటూ ఫైర్
- అమరవీరులను అవమానించొద్దంటూ హెచ్చరిక
- కాంగ్రెస్ తీరుపై తీవ్ర ఆవేదన
- 'చరిత్ర ఎవరినీ క్షమించదు' అంటూ వార్నింగ్

2 లో

# సోషల్ మీడియాపై కేంద్రం నిఘా

- ఫేక్ ప్రచారంపై కేంద్రం కీలక చర్యలు
- ప్రభుత్వ శాఖల్లో క్విక్ రెస్పాన్స్ టీమ్స్
- రెండు గంటల్లోనే అధికారిక రియాక్షన్
- ఫేక్ కంటెంట్‌పై నిరంతర నిఘా
- పీఐబీ ఫ్యాక్ట్ చెక్‌తో సమన్వయం

2 లో


Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సోమవారం 17-08-2026

# తెలంగాణలో కల్తీ, నకిలీలకు ఇక చెక్..

మొదటి పేజీ తరువాయి


Government of Telangana
ABSTRACT

HM&FW Department – Establishment of a TGSAFE (Telangana Standards Authority for Food and Essential drugs) through merger of the Food Safety and the Drugs Control Department – Orders – Issued.

HEALTH, MEDICAL & FAMILY WELFARE (G) DEPARTMENT

G.O.Ms.No. 67 Dated:04.08.2026

*****

ORDER:

1. Preamble

1.1 With the increasing volume of licensed food business operators in Telangana State, there is a need to strengthen compliance and enforcement under the Food Safety and Standards Act, 2006 and the Drugs and Cosmetics Act, 1940, to prevent unsafe, spurious and substandard food and drugs and protect public health.

1.2 The Food Safety Department, functioning under the Commissioner Food Safety, and the Drugs Control Department, functioning independently since 1981, regulate food, drugs and cosmetics through licensing, inspection, sampling, testing and enforcement.

1.3 A single-line administrative integration of Food and Drug Department augmenting statutory roles and improving coordination, surveillance, and regulatory outcomes has already been successfully adopted in several states across the country.

1.4 The Food Safety Department and the Drugs Control Department share common objectives relating to public health, consumer safety, quality assurance and effective regulatory enforcement. A unified administrative framework is required to improve surveillance, intelligence, enforcement, legal support and regulatory outcomes.

1.5 Government, after careful examination, now decides to establish a unified administrative structure for the Food Safety Department and the Drugs Control Department.

2. Merger of the Food Safety and Drugs Control Departments

2.1 The Food Safety Department and the Drugs Control Department shall be merged under a unified administration hereby known as the "TG SAFE (Telangana Standards Authority for Food and Essential drugs)".

2.2 The unified administration shall preserve the statutory provisions under the Food Safety and Standards Act, 2006 and the Drugs and Cosmetics Act, 1940. The respective statutory authorities and officers shall continue to exercise their powers independently in accordance with the relevant enactments.

3. Functional Structure of TG SAFE (Telangana Standards Authority for Food and Essential drugs)

3.1 The Commissioner, TG SAFE (Telangana Standards Authority for Food and Essential drugs) shall function as unified administrative control for Food Safety and Drug Control Departments.

(PTO)

కోర్టు కేసులు, చట్టపరమైన సలహాల కోసం లీగల్ అండ్ ప్రాసిక్యూషన్ వింగ్, ఫుడ్ సేఫ్టీ ల్యాబ్ మరియు డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లను కలుపుతూ లాబొరేటరీ వింగ్, మానవ వనరులు, బడ్జెట్, ఖాతాల పర్యవేక్షణకు అడ్మినిస్ట్రేటివ్ వింగ్‌లను ఏర్పాటు చేశారు.

క్యూర్ రీజియన్‌లో అమలు..

ఎక్కువ సంఖ్యలో ఆహార, ఔషధ తయారీ కేంద్రాలు కలిగిన క్యూర్ రీజియన్‌లో టీజీ సేఫ్ కమిషనర్ అవినాశ్ మహంతి తమ కార్యకలాపాలను మొదటగా ప్రారంభించనున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల కోసం అవసరమైన పోలీసు సిబ్బందిని కేటాయించాలని ఇప్పటికే తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు ఆదేశాలు అందాయి. ఖాళీగా ఉన్న మంజూరైన పోస్టులను డిప్యుటేషన్, కాంట్రాక్ట్ లేదా అవుట్‌సోర్సింగ్ పద్ధతి ద్వారా భర్తీ చేసేందుకు అనుమతి లభించింది. మరోవైపు ఈ శాఖల ఆధునీకరణ, సేవా నిబంధనల సవరణ, కేడర్ బలాన్ని ఖరారు చేయడం, ల్యాబ, క్షేత్రస్థాయి మౌలిక వసతుల పెంపుపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించేందుకు ప్రభుత్వం ఓ రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ క్యూర్ రీజియన్‌లో లభించిన ఫలితాలను పరిశీలించి, రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి శాఖ అమలుపై నివేదిక అందిస్తుంది.

# కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్

మొదటి పేజీ తరువాయి

కేవలం ఓటు బ్యాంక్ రాజకీయం కోసమే జాతీయ గేయాన్ని అవమానించిందని.. అందుకు కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాలని కామెంట్ చేశారు. ఈ ఘటనపై సోనియా గాంధీ 140 కోట్ల భారతీయులకు, అలాగే వందేమాతరం రచయిత బంకిం చంద్ర ఛటర్జీకి బహిరంగ క్షమాపణలు చెప్పాలని అమిత్ షా డిమాండ్ చేశారు.

అయితే, 'వందేమాతరం' గేయాలాపనపై అమిత్ షా వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. వేడుకల్లో వందేమాతరం గీతాన్ని పూర్తిగా ఆలపించామని క్లారిటీ ఇచ్చింది. ఈ విషయంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ మాట్లాడుతూ.. సోనియా గాంధీ పాటను ఆపమని చెప్పలేదని, కొంతసేపటి నుంచి నిలబడి ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే కోసం కుర్చీ వేయమని మాత్రమే కార్యకర్తలకు సూచించారని స్పష్టం చేశారు. బీజేపీ కావాలనే ఈ అంశాన్ని రాజకీయం చేస్తోందని ఆయన మండిపడ్డారు.

# బీసీ కులగణనపై పొన్నం ఫైర్



**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** దేశవ్యాప్త కులగణనపై కేంద్రం మోసం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. జనగణనలో కులగణన చేస్తామని గతంలో ప్రకటించిన మోడీ లెక్కల సేకరణకు వచ్చేసరికి మోసం చేశారని విమర్శించారు. జనగణనపై కేంద్రం ఇచ్చిన సర్క్యులర్ ను సవరించి దేశంలో బీసీల జనాభా ఎంత ఉందో తెలుసుకునే ప్రశ్నను చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ/ఎస్ఈబీసీ(సోషల్లీ అండ్ ఎడ్యుకేషనల్లీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్) లకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి పొన్నం ప్రభాకర్ ఆదివారం లేఖ రాశారు. 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ/ఎస్ఈబీసీల జనాభాను శాస్త్రీయంగా, పారదర్శకంగా నమోదు చేసేలా ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని కోరారు.

తెలంగాణ అనుభవాన్ని పరిగణలోకి తీసుకోండి:

ఎస్సీ, ఎస్టీతో పాటు ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీ, రాష్ట్రాల వారీగా మాస్టర్ కుల డైరెక్టరీ, కులాలకు ప్రత్యేక డిజిటల్ కోడ్ లు ఏర్పాటు చేయాలని కోరారు. 2011 ఎస్ఈసీసీలో ఎదురైన కులాల పేర్లు, స్పెల్లింగ్‌లు, ఉపకులాల సమస్యలు పునరావృతం కాకుండా ప్రమాణీకృత విధానం అవలంబించాలని, తెలంగాణలో నిర్వహించిన SEEPC సర్వే అనుభవాన్ని కూడా 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన వర్గాల వాస్తవ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులపై ప్రామాణిక సమాచారం ఉంటేనే రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమం, సమాన ప్రాతినిధ్యానికి సమర్థవంతమైన విధానాలు రూపొందించగలం అని లేఖలో పేర్కొన్నారు.

బండి సంజయ్ మాట్లాడకపోవడం బాధాకరం:

గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన పొన్నం బీసీ కులగణనపై కేంద్ర వైఖరిని ఖండించారు. జనగణనపై కేంద్రం విడుదల చేసిన ప్రశ్నావళిలో బీసీల ప్రస్తావన లేదని జనగణన పత్రం 40 ప్రశ్నల్లో ఎస్సీ, ఎస్టీల ప్రస్తావన మాత్రమే ఉందని విమర్శించారు. పూర్తి స్థాయి కులగణన చేస్తామని చెప్పి ప్రశ్నావళిలో బీసీల ప్రస్తావన పేర్కొనలేదని దుయ్యబట్టారు. బీసీ అని చెప్పుకునే మోడీ బీసీల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఒత్తిడి వల్లే దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రం దిగివచ్చిందని అయితే జనగణనలో కులగణన చేస్తామని గతంలో ప్రకటించిన మోడీ లెక్కల సేకరణకు వచ్చేసరికి మోసం చేశారని విమర్శించారు. జనగణనపై కేంద్రం ఇచ్చిన సర్క్యులర్ ను సవరించి దేశంలో బీసీల జనాభా ఎంత ఉందో తెలుసుకునే ప్రశ్నను చేర్చాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎవరి జనాభా ఎంత ఉందో తెలిస్తే న్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు ఇంత అన్యాయం జరుగుతుంటే బీసీ అయిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా స్పందించకపోవడం బాధాకరం అన్నారు. బండి సంజయ్ వందేమాతరం గురించి కాదు బీసీల గురించి మాట్లాడాలన్నారు.

# ప్రియాంక కేసుపై సర్కార్ ఫోకస్



**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన డాక్టర్ ప్రియాంక హత్యకేసు దర్యాప్తులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ కేసుకు సంబంధించి సమగ్ర విచారణ జరిపేందుకు విచారణాధికారిగా ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజు ను నియమిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజ్‌కు ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను అప్పగించింది. డాక్టర్ ప్రియాంక హత్యకేసుపై వేగవంతంగా విచారణ పూర్తి చేసి, అన్ని కోణాల్లో ఆధారాలు సేకరించి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉత్తర్వులు అందుకున్న ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజు త్వరలోనే దర్యాప్తును వేగవంతం చేయనున్నారు.

కాగా, డాక్టర్ ప్రియాంక తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో డెర్మటాలజీ విభాగంలో పీజీ ఫస్టియర్ చదువుతున్నారు. ఈ నెల 3న రాత్రి రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్య మాల్‌లో మూవీ చూసేందుకు తోటి క్లాస్‌మేట్‌తో కలిసి ఆమె స్కూటీపై బయలుదేరారు. వాహనాలు థియేటర్ గేటు వద్ద ఆగగా, అదే సమయంలో నామవరానికి చెందిన సురవరపు దుశ్వంత్, లాలాచెరువుకు చెందిన ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ మద్యం మత్తులో కారు వేగంగా నడుపుతూ వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టారు. తర్వాత మరోసారి ఢీకొట్టి.. పైనుంచి కారు వెళ్లడంతో కింద పడిపోయిన ప్రియాంక తలకు తీవ్ర గాయమైంది. ఆమె పరిస్థితి విషమించడంతో ఈ నెల 6న సికింద్రాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమెను బతికించేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

# రెట్రోఫిట్ స్కీమ్‌పై పొన్నం ప్రకటన

మొదటి పేజీ తరువాయి

అందులో ఒకటి ప్రస్తుత ఆటోను ఏఐఎస్-123 ఆమోదించిన ఎలక్ట్రిక్ కిట్‌తో రెట్రోఫిట్ చేసుకోవడం లేదా పాత ఆటోను అప్పగించి కొత్త ఎలక్ట్రిక్ ఆటోను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఈ రెండింటిలో ఏది ఎంచుకున్నా ఆటో యజమానికి రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047కు అనుగుణంగా ఈ పథకానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం ద్వారా వాయు, శబ్ద కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆటో డ్రైవర్లకు పెట్రోల్, డీజిల్ ఖర్చు నుంచి ఆర్థిక ఉపశమనం కల్పించాలన్నదే మా లక్ష్యం. హైదరాబాద్‌ను స్వచ్ఛమైన గాలి, సుస్థిర ప్రజా రవాణా దిశగా తీసుకెళ్లడంతో పాటు ఆటో డ్రైవర్ల ఆర్థిక ప్రయోజనాలను కాపాడేలా ఈ పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు.

# టీఎంసీ కార్యాలయంలో ఆత్మహత్య



**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** ఐదు సార్లు ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన కీలక నేత ఏకంగా పార్టీ కార్యాలయంలో ఆత్మహత్య చేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ షాకింగ్ ఘటన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బీర్భూమ్ జిల్లా, రాంపూర్ హాట్ లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బెంగాల్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్, తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత ఆశిష్ బెనర్జీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో గల టీఎంసీ పార్టీ కార్యాలయం లో ఆయన ఉరేసుకుని విగతజీవిగా కనిపించినట్లు పోలీసులు ధ్రువీకరించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కార్యాలయంలో ఓ సూసైడ్ నోట్ ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఆశిష్ బెనర్జీ రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు మమతా బెనర్జీ మంత్రివర్గంలో విద్యా, వ్యవసాయ శాఖల మంత్రిగా, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన మరణానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. సీనియర్ నేత అకాల మృతితో టీఎంసీ శ్రేణుల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# యూరప్‌లో హీట్ వేవ్



**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** యూరప్‌లో జూన్, జూలై నెలల్లో వేడిగాలుల ధాటికి ప్రజలు అల్లాడిపోయారు. యూరప్ ఖండంలో వేసవి తీవ్రత, వాతావరణ మార్పుల దుష్ప్రభావాలు ఎంతటి భయానక పరిస్థితికి దారితీస్తున్నాయో ప్రభుత్వ నివేదిక స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో వీచిన తీవ్రమైన వేడిగాలులు యూరోపియన్ ప్రజల ప్రాణాలను తీశాయి. యూరోపియన్ మోర్టాలిటీ మానిటరింగ్ నెట్‌వర్క్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, జూన్ 22 నుంచి 28 మధ్య ఉన్న కేవలం ఒక్క వారంలోనే ఏకంగా 16,000 మంది తీవ్రమైన ఉష్ణోగ్రతల ధాటికి మరణించినట్లు అంచనా వేసింది.

ఈ ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల సెల్సియస్‌ను దాటడంతో ఫ్రాన్స్, బెల్జియం, జర్మనీ వంటి పశ్చిమ యూరప్ దేశాలపై దీని ప్రభావం తీవ్రంగా పడింది. సాధారణంగా చల్లని వాతావరణానికి అలవాటుపడిన ఈ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో, పెద్ద సంఖ్యలో ప్రజలు ఆరోగ్య సమస్యల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. గతంలో 2022లో కూడా సరిగ్గా ఇదే స్థాయిలో (16,000 మంది) వేడిగాలుల వల్ల ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. వరుసగా నమోదువుతున్న ఈ గణాంకాలు యూరప్‌లో గ్లోబల్ వార్మింగ్ విసిరే విపరీతమైన సవాళ్లను మరియు ప్రజారోగ్యానికి ఎదురవుతున్న తీవ్ర ముప్పును ఎత్తిచూపుతున్నాయి.

# మేడారం నుంచి సంక్షేమ శుభారంభం



**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** సమ్మక్క-సారలమ్మ వనదేవతల దివ్య ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రంలో కొత్త సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పర్యటన ద్వారా శ్రీకారం చుట్టారు.

కొత్త పింఛన్ల పంపిణీ:

రాష్ట్రంలోని అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలకు నూతనంగా ఆసరా పింఛన్లు అందించే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని మేడారం పవిత్ర పుణ్యక్షేత్రం నుంచే సీఎం లాంఛనంగా ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో అర్హులైన 24 మంది వితంతువులు, ఒంటరి మహిళలకు రూ. 2,016/- చొప్పున ఆసరా చేయూత పింఛను ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ముఖ్యమంత్రి స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ పిలుపు, వాటర్ ప్లాంట్ ప్రారంభం:

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పర్యావరణ స్పృహను పెంపొందించేలా ముఖ్యమంత్రి ఒక మొక్కను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి సామాజిక బాధ్యత. భావి తరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలి" అని పిలుపునిచ్చారు. అలాగే, మేడారానికి వచ్చే వేలాది మంది భక్తులు, యాత్రికుల దాహార్తి తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధి చేసిన తాగునీటి (వాటర్) ప్లాంట్‌ను సీఎం ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన:

మేడారం గిరిజన క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రూ. 294 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనుల పురోగతిని ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "మేడారం సమ్మక్క-సారలమ్మల వీర పోరాట పటిమ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రత్యక్ష ప్రతీక. ఉత్తర భారతదేశంలో కుంభమేళా ఎంత పవిత్రమైనదో, మన దక్షిణ భారతదేశంలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలకు మేడారం జాతర అంతటి మహోన్నతమైనది. జాతరకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తోంది" అని స్పష్టం చేశారు. జంపన్న వాగులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా నిరంతరం నీరు లభ్యమయ్యేలా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

మహిళా సంఘాలతో గ్రూప్ ఫోటో – ములుగుకు పయనం:

అనంతరం, ఆలయ ప్రాంగణంలో స్థానిక స్వయం సహాయక మహిళా సంఘాల (ఐకేపీ/సెర్ప్) సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమై, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. అక్కడున్న మహిళల నడుమ కొద్దిసేపు గడిపి వారి ముఖాల్లో ఆనందాన్ని నింపారు. మేడారంలో పూజలు, కార్యక్రమాలు ముగించుకున్న అనంతరం సీఎం బృందం ములుగు జిల్లా కేంద్రానికి బయలుదేరింది. ముఖ్యమంత్రి పర్యటనతో మేడారం క్షేత్రంతో పాటు ములుగు జిల్లా వ్యాప్తంగా సర్వత్రా పండుగ వాతావరణం, కోలాహలం నెలకొంది.

# సోషల్ మీడియాపై కేంద్రం నిఘా




**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** సోషల్ మీడియాలో వేగంగా వ్యాపిస్తున్న నకిలీ వార్తలు, తప్పుదోవ పట్టించే ప్రచారాలకు తక్షణమే అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విధానాలు, పథకాలు, నిర్ణయాలపై సామాజిక మాధ్యమాల్లో జరిగే అసత్య ప్రచారాలను తిప్పికొట్టడానికి వివిధ మంత్రిత్వ శాఖలలో ప్రత్యేకంగా 'క్విక్ రెస్పాన్స్ టీమ్స్' ను ఏర్పాటు చేస్తోంది. ప్రజలతో సోషల్ మీడియా ద్వారా నిర్మాణాత్మకంగా అనుసంధానమై.. పుకార్లు, తప్పుడు సమాచారం, ఫేక్ కంటెంట్‌పై సకాలంలో వాస్తవాలను వెల్లడించడమే ఈ బృందాల ప్రధాన ఉద్దేశమని ఓ అధికారి వెల్లడించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

రెండు గంటల్లో రియాక్షన్:

ఇప్పటికే విద్యుత్, వ్యవసాయం, వాణిజ్య శాఖలు ప్రత్యేకంగా క్యూఆర్‌టీలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఆయా శాఖలకు సంబంధించిన విధానాలు, పథకాలు, కార్యక్రమాలు, నిర్ణయాలు, ప్రకటనలపై సోషల్ మీడియా టీమ్స్ నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నాయి. ఏదైనా కంటెంట్ నకిలీది లేదా తప్పుదోవ పట్టించేలా వాస్తవాలకు విరుద్ధంగా ఉంటే అలాంటి వాటిని గుర్తించిన రెండు గంటల వ్యవధిలోనే సరైన నిజానిజాలతో కూడిన అధికారిక స్పందనను ఈ క్యూఆర్?టీలు విడుదల చేయనున్నాయి. ఇందుకోసం ఆయా శాఖల సోషల్, డిజిటల్ మీడియా బృందాలు.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన న్యూ మీడియా విభాగం నుంచి వచ్చే సమాచారంతో సమన్వయం చేసుకుంటాయని సదరు అధికారి వెల్లడించినట్లు కథనం పేర్కొంది.

వాస్తవాలకు వారధిగా:

క్యూఆర్‌టీలు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌తోనూ సమన్వయం చేసుకుంటాయని అధిక వైరల్ అయిన కంటెంట్, ప్రజల్లో విస్తృత ఆసక్తి కలిగించే అంశాలు, సున్నితమైన విధానపరమైన విషయాలు, ప్రజలకు హాని కలిగించే అవకాశం ఉన్న ప్రచారం, చట్టపరమైన అంశాలు, సమన్వయంతో జరుగుతున్న తప్పుడు ప్రచారాలు, ఒకటి కంటే ఎక్కువ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన కేసులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు సమాచారం. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు వేగంగా స్పందించి వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో ఈ క్యూఆర్‌టీలు కీలకంగా మారనున్నాయి.

# వందేమాతరం ఏ పార్టీ సొత్తు కాదు



**న్యూస్ డెస్క్, 16 ఆగష్టు (ఇది కద నిజం):** స్వాతంత్ర్య దినోత్సవం రోజున కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గీతం ఆలాపనపై చోటుచేసుకున్న పరిణామాలపై బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ కుటుంబ వారసుడు, పశ్చిమ బెంగాల్ (నైహాటి) బీజేపీ ఎమ్మెల్యే సుమిత్రో ఛటర్జీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దేశ ప్రజలకు, ముఖ్యంగా బెంగాల్ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ఆయన లేఖ రాశారు.

చారిత్రక తప్పునకు పునరావృతం

80వ స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15న) సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయంలో వందేమాతరాన్ని పూర్తిగా పాడకుండా అడ్డుకునే ప్రయత్నం జరగడం దురదృష్టకరమని, ఇది గతంలో చేసిన 'చారిత్రక తప్పుకు సిగ్గుమాలిన పునరావృతం' అని ఎమ్మెల్యే అభివర్ణించారు.

ఏ పార్టీ సొత్తు కాదు..

వందేమాతరం ఏ ఒక్క రాజకీయ పార్టీ ఆస్తి కాదని, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రతో, అమరవీరుల రక్తంతో ముడిపడిన పవిత్ర జాతీయ ప్రతీక అని గుర్తుచేశారు. ఈ గీతాన్ని పూర్తిగా పాడేందుకు సంకోచించడం ఖుదీరామ్ బోస్ లాంటి అమరవీరులను అవమానించడమేనన్నారు. 1937లో మహ్మద్ అలీ జిన్నా అభ్యంతరాలకు తలొగ్గి కాంగ్రెస్ ఈ గీతాన్ని కుదించిందని, ఆ ద్వంద్వ వైఖరి, రాజీ నీడ నేటికీ ఆ పార్టీ ప్రవర్తనలో కనిపిస్తోందని విమర్శించారు. తమ సొంత స్వాతంత్ర్య మంత్రాన్ని గౌరవించడంలో విఫలమైన నాయకత్వం కాలగర్భంలో కలిసిపోతుందని, 'చరిత్ర ఎవరినీ క్షమించదు' అని సుమిత్రో ఛటర్జీ తన లేఖలో హెచ్చరించారు. ఈ సంఘటన బెంగాలీలతో పాటు యావత్ దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని, తాను ఒక సాధారణ పౌరుడిగా, దేశభక్తుడిగా ఈ లేఖ రాస్తున్నానని, సోనియా గాంధీ ఆత్మవిమర్శ చేసుకొని క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఇంటర్ బోర్డులో అక్రమాల రచ్చ!

మొదటి పేజీ తరువాయి




మెమోల మార్పిడితో అక్రమాలు..

గతంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు పొందే సమయంలో ఇతర రాష్ట్రాల యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్లను (98 శాతంపైగా మార్కులతో) చూపించి, స్థానికంగా ఉమ్మడి ఏపీలో చదివిన అర్హులైన నిరుద్యోగులకు అవకాశం దక్కకుండా చేశారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ సమయంలో పోలీసు విచారణ జరిగితే ఇతర రాష్ట్రాల నకిలీ మెమోల గుట్టు రట్టవుతుందని భావించి, కాలేజీలు మారే క్రమంలో పాత మెమోల స్థానంలో తక్కువ మార్కులు ఉన్న స్థానిక యూనివర్సిటీల మెమోలను దొంగతనంగా ఫైళ్లలో చేర్చారు. మరికొందరు కలర్ జిరాక్స్‌లు, గ్రాఫిక్స్ మాయాజాలంతో పర్సంటేజీలు పెంచుకొని అధికారుల కళ్లుగప్పారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఆర్టీఐ ద్వారా సమాచారం అడిగితే ఇంటర్మీడియట్ అధికారులు ఇవ్వకపోవడం గమనార్హం. అధికారుల ప్రత్యక్ష ప్రమేయం, ఆమోదం లేకుండా సర్టిఫికెట్ల విచారణ పరిధి దాటి ఈ స్థాయిలో అక్రమాలు జరగడం సాధ్యం కాదని పలు విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి.

బయటపడుతున్న ఉదాహరణలు..

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనారావుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న ఒక అభ్యర్థి.. మొదట లలిత్ నారాయణ్ మిథిలా యూనివర్సిటీ నుంచి 98 శాతం మార్కుల మెమోతో ఉద్యోగం పొందాడు. ఆ తర్వాత బదిలీ సమయంలో, తనకు కేవలం 53 శాతం మార్కులు మాత్రమే ఉన్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీజీ సర్టిఫికెట్‌ను ఫైల్‌లో మార్చి రెగ్యులరైజేషన్ పొందాడు. వాస్తవానికి ఆ రోజుల్లో 53 శాతం మార్కులతో ఏ కేటగిరీ అభ్యర్థికీ కాంట్రాక్ట్ ఉద్యోగం రాలేదు. ఖమ్మం జిల్లాలో ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రమబద్ధీకరణ పొందిన ఓ మహిళా లెక్చరర్ సైతం అధికారులను బురిడీ కొట్టించి ఇదే తరహాలో పర్మినెంట్ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా లో ఓ అధ్యాపక సంఘం మహిళా కార్యదర్శి ఉద్యోగంలో చేరినప్పటి థర్డ్ క్లాస్ మెమోని మాయం చేసి, ఫస్ట్ క్లాస్ మెమోని అధికారులకు సమర్పించి రెగ్యులర్ అయినట్టు బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

అలసత్వంలో విద్యాశాఖ ..

నిజమైన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తూ నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఇంటర్ విద్యాశాఖ తీవ్ర అలసత్వం వహిస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. అక్రమాలు వెలుగులోకి వచ్చినా కమిటీల పేరిట కాలాపయాపన చేస్తున్నారని, సూత్రధారులైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపిస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు సంపాదించిన వారిని తక్షణమే ఉద్యోగాల నుంచి తొలగించడమే కాకుండా, వారికి సహకరించిన ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# జొనిట వివాహ విందుకు సీఎం రేవంత్ రెడ్డి హాజరు

- వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి
- అంగరంగవైభవంగా వివాహ వేడుక






ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె జొనిట వివాహ విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, సంజీవ్ రెడ్డి, ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు అశేష జనవాహిని తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చేయూత.. ప్లేట్లు, పెన్నుల పంపిణీ

### గౌరారం పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు, పెన్నులు పంపిణీ చేశారు. పిట్లం రిటైర్డ్ ఉపాధ్యాయులు దయానంద్ విద్యార్థులకు ప్లేట్లు వితరణ చేయగా, వార్డు సభ్యులు మారుతి పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంత్ రావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జే. శంకర్, ఉప సర్పంచ్ దొడ్ల హన్మండ్లు ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నాగుల పంచమి పర్వదినం ప్రతి ఇంటా సిరిసంపదలు నింపాలి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, గౌరారం: పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూపాల శంకర్ కొట్టు గ్రామ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'ఇది కద నిజం' దినపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ, పంచమి పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ప్రజలందరికీ పంచమి శుభాకాంక్షలు తెలిపారు.

# నాగుల పంచమి పర్వదినం ప్రతి ఇంటా సిరిసంపదలు నింపాలి




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా పిట్లం మండల ప్రజలకు కామారెడ్డి జిల్లా బీసీ రాజ్యాధికార సమితి సంఘ అధ్యక్షులు కుమ్మరి యాదగిరి అధ్యక్షులు నాగుల పంచమి సందర్భంగా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'ఇది కద నిజం' దినపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ, పంచమి పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ప్రజలందరికీ పంచమి శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా విద్యాధికారిపై వ్యాఖ్యలను ఖండించిన ఉపాధ్యాయ సంఘాలు

- GO 25 ప్రకారమే మిగులు ఉపాధ్యాయుల కేటాయింపు ప్రక్రియ జరిగింది
- MEOల సమగ్ర నివేదికలు, ప్రధానోపాధ్యాయుల సీనియారిటీ జాబితాల ఆధారంగానే వివరాల సేకరణ
- జిల్లా కలెక్టర్ అనుమతితోనే DEO ఉత్తర్వులు జారీ చేశారు; ఇందులో DEO సొంత నిర్ణయాలేవీ లేవు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన TPUS, PRTU రంగారెడ్డి జిల్లా నాయకులు




ఇది కద నిజం,హైదరాబాద్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవో నెంబర్ 25ను అనుసరించి జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. జిల్లా విద్యాధికారి నిబంధనలకు లోబడే వ్యవహరించారని, వారిపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సరికావని పేర్కొంటూ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా TPUS రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోట్ల కాశీరావు, ప్రధాన కార్యదర్శి పూజరి రమేష్, అలాగే PRTU జిల్లా అధ్యక్షులు S. మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణా రెడ్డి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ముందుగా ఆయా మండల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి మిగులు ఉపాధ్యాయుల వివరాలను సేకరించారని వివరించారు. ఈ ప్రక్రియలో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి, సీనియారిటీ నిబంధనల ప్రకారమే మిగులు ఉపాధ్యాయుల జాబితాను రూపొందించినట్లు తెలిపారు. MEOలు సమర్పించిన నివేదికల ఆధారంగా, ఉపాధ్యాయుల అవసరం ఉన్న పాఠశాలలకు వారిని కేటాయిస్తూ గౌరవ జిల్లా కలెక్టర్ అనుమతితోనే DEO ఉత్తర్వులు జారీ చేశారని నాయకులు గుర్తుచేశారు. ఈ కేటాయింపుల్లో జిల్లా విద్యాధికారి స్వతంత్రంగా ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేదని, ఇందులో వారి పాత్ర ఏమీ లేదని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం జరిగిన ప్రక్రియపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే DEO ఇష్టానుసారంగా వ్యవహరించారని గట్టిగా మందలించడం భావ్యం కాదని సంఘాల నాయకులు ఖండించారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు అత్తాపూర్ ఇస్కాన్ ఆహ్వానం

- 1 లక్ష మందికి 'అన్నదాన్ సేవ
- సెప్టెంబర్ 4న ఉదయం 8:00 గంటల నుండి అర్ధరాత్రి 1:00 గంట వరకు భక్తులకు స్వామివారి దర్శనం
- ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 5 వరకు ఉచితంగా "మహా అన్నదాన్ సేవ
- భక్తులందరూ పాల్గొని శ్రీకృష్ణుని దివ్య ఆశీస్సులు పొందాలని నిర్వాహకుల పిలుపు




ఇది కద నిజం, అత్తాపూర్ : శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇస్కాన్ అత్తాపూర్ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకుని భక్తులందరూ తమ కుటుంబసమేతంగా పాల్గొని, శ్రీకృష్ణుని దివ్య ఆశీస్సులు పొందాల్సిందిగా నిర్వాహకులు ఆత్మీయ ఆహ్వానం పలికారు. సెప్టెంబర్ 4, 2026న ఉదయం 8:00 గంటల నుండి అర్ధరాత్రి 1:00 గంట వరకు భక్తులకు స్వామివారి దివ్య దర్శన సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా సమాజసేవే పరమావధిగా ఇస్కాన్ అత్తాపూర్ ఓ విశేషమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 5, 2026 వరకు దాదాపు 1 లక్ష మంది పేదలకు మరియు అవసరంలో ఉన్నవారికి ఉచితంగా ప్రసాదాన్ని అందించే "మహా అన్నదాన్ సేవ"ను నిర్వహిస్తున్నారు. ఈ పవిత్రమైన అన్నదాన సేవలో భాగస్వాములై, శ్రీకృష్ణుని కృపాకటాక్షాలను ప్రసాదం రూపంలో అందరికీ పంచేందుకు భక్తులు, దాతలు ఉదారంగా ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. ఈ సేవకు విరాళాలు అందించాలనుకునే వారు https://www.iskconattapur.com/krishna అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి తమ సహాయాన్ని అందించవచ్చని ఇస్కాన్ అత్తాపూర్ ప్రతినిధులు వెల్లడించారు.

# సత్తుపల్లి 108 టెక్నీషియన్ గొల్లమందలకు భట్టి చేతుల మీదుగా పురస్కారం"



సత్తుపల్లి, ఆర్ సి,ఆగస్టు16 (ఇది కద నిజం) న్యూస్: శనివారం 80 వ స్వాతంత్ర్య దినోత్సవశీ సందర్భంగా ఖమ్మంలో జరిగిన 80 వ స్వతంత్ర దినోత్సవవేడుకలో 108 సర్వీస్ లో జిల్లాస్థాయిలో అత్యుత్తమ సేవలు అందించిన సత్తుపల్లి 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల కృష్ణ కు పురస్కారం దక్కింది.తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతులమీదుగా ప్రశంసాపత్రం ఇచ్చారు. కృష్ణను జిల్లా కలెక్టర్ టి.ఏస్.దివాకర (ఐఏఎస్), సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ బి.సురేష్ నారాయణ,108 కార్యక్రమ మేనేజర్ షేక్ నజీరుద్దీన్,108 సేవా జిల్లా మేనేజర్ ఆలేటి ప్రణయ్ కుమార్,తోటి ఉద్యోగులు,మీడియా మిత్రులు అభినందిచారు.

# రాంపురం గ్రామంలో ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



**ఇది కద నిజం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

మరిపెడ మండలం రాంపురం గ్రామంలో ఘనంగా ముత్యాలమ్మ బోనాల వేడుకలు జరుపుకున్నారు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయంలో భాగంగా శ్రావణమాసం ఏళ్లుదాలకు అసలేరు కార్తెలో ఏటా నిర్వహించుకునే సాంప్రదాయం ప్రకారం ముత్యాలమ్మ తల్లీ అమ్మవారి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం గ్రామ ప్రజలు, భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొని వారితో ఆత్మీయంగా ముచ్చటించారు.ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు,గ్రామ పెద్దలు, భక్తులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కు ఇక నోడల్ ఆఫీసర్ ఎంపీడీఓ లే"

### ప్రతి సోమవారం మండల పరిషత్ లో ప్రజావాణి"



సత్తుపల్లి/ వేంసూరు, ఆగస్టు 16 (ఇది కద నిజం) న్యూస్ : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారినీ దారెల్లి కావ్య ఆదివారం మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. వేంసూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని పేర్కొన్నారు.

మండల స్థాయి అధికారులు ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. మండల ప్రజలు తమ సమస్యలపై ఆర్జీలతో ప్రతి సోమవారం కార్యాలయానికి హాజరై ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సినిమా న్యూస్

## 'న్యూటన్స్ థర్డ్ లా' స్ట్రీమింగ్ ఫిక్స్!




టాలీవుడ్ నటుడు సుమంత్ తాజాగా 'న్యూటన్స్ థర్డ్ లా' చిత్రంతో ప్రేక్షకులను పలకరించాడు. మంచి అంచనాల నడుమ విడుదలైన ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనే స్థాయి విజయం దక్కింది. దీంతో ఈ మూవీ డీసెంట్ కలెక్షన్లను వసూలు చేసింది. ఇక ఈ చిత్రం ఓటీటీ ఎంట్రీకి సిద్ధమైంది. ఆగస్టు 27వ తేదీ నుంచి ఈటీవీ విన్ ఓటీటీలోకి ఎంట్రీ ఇవ్వనుంది. ఈ విషయాన్ని సదరు సంస్థ అధికారికంగా ప్రకటించింది. బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనే స్థాయిలో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి. ఈ చిత్రానికి రాజేష్ కర్ణ దర్శకత్వం వహించగా, జగపతి బాబు, అవసరాల శ్రీనివాస్, రవివర్మ, నేహా పఠాన్, త్రినాథ్ వర్మ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. సింజిత్ ఎర్రమిల్లి సంగీతం అందించిన ఈ చిత్రాన్ని కె. హరీష్ నిర్మించగా, ఈటీవీ విన్ సమర్పించింది.




## 51 ఏళ్ల సినీ ప్రస్థానం

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో సూపర్‌స్టార్ రజినీకాంత్ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. ఆయన సినీ ప్రయాణం ప్రారంభమై ఆగస్టు 15 నాటికి సరిగ్గా 51 సంవత్సరాలు పూర్తయ్యాయి. 1975లో ఇదే రోజున విడుదలైన 'అపూర్వ రాగాలు' సినిమా ద్వారా ఆయన నటుడిగా అరంగేట్రం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఐదు దశాబ్దాలకు పైగా తనదైన శైలిలో నటిస్తూ అసాధారణమైన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.

అయితే ఈ స్పెషల్ మూమెంట్‌ని ఆయన తన తదుపరి చిత్రమైన 'ధర్మన్' షూటింగ్ సెట్స్‌లో ఘనంగా జరుపుకున్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తుతో పాటు చిత్ర యూనిట్ సభ్యులు ప్రత్యేకంగా కేక్ కట్ చేసి సూపర్‌స్టార్‌ను సత్కరించారు. "51 సంవత్సరాలు. ఒకే పేరు. ఒకే సూపర్‌స్టార్" అంటూ చిత్ర బృందం ఈ వేడుకకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకుంది.

కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'ధర్మన్' చిత్రం రజినీకాంత్ కెరీర్‌లో 173వ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతోంది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సిమ్రాన్, రాశి ఖన్నా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## హనుతో ప్రభాస్ మరో మూవీ?

ప్రభాస్ ప్రస్తుతం నటిస్తున్న చిత్రాల్లో 'ఫౌజీ' ఒకటి. ఇటీవల ఈ చిత్ర నిర్మాత మైత్రి రవిశంకర్ మాట్లాడుతూ.. ప్రభాస్ ఈ సినిమాను చాలా నమ్ముతున్నారని తెలిపారు. ఆయనకు షూటింగ్ షెడ్యూల్ లేకపోయినా సెట్‌కు వచ్చి మానిటర్ ముందు కూర్చుంటున్నారని చెప్పారు. ఈ మూవీ ప్రభాస్ కెరీర్‌లోనే పెద్ద హిట్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతోనే సినిమాపై అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఇక ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్ర దర్శకుడు హను రాఘవపూడి వర్కింగ్ స్టైల్‌కు ప్రభాస్ ఫిదా అయినట్లు తెలుస్తోంది. దీంతో వీరిద్దరి మధ్య అనుబంధం మరింత బలపడినట్లు సమాచారం. హను సెట్లో ఏది చెప్పినా ప్రభాస్ తూచా తప్పకుండా పాటిస్తున్నారని, తానొక స్టార్ హీరో అనే విషయాన్ని మరిచిపోయి ఎంతో డౌన్ టు ఎర్త్‌గా ఉంటున్నారని తెలుస్తోంది.

అలాగే హను ప్రతి సన్నివేశాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రభాస్ తన సన్నిహితులు, స్నేహితులతో ఎంతో గర్వంగా చెబుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'కల్కి 2' చిత్రాల్లో కూడా నటిస్తున్నారు. ఈ రెండు చిత్రాల షూటింగ్ సమయంలోనూ ప్రభాస్ ఎక్కువగా 'ఫౌజీ' సినిమా గురించే మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరి మధ్య ఈ స్థాయిలో స్నేహం కుదరడంతో.. 'ఫౌజీ' పూర్తయిన వెంటనే హను రాఘవపూడితో ప్రభాస్ మరో సినిమా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని హోంబలే ఫిల్మ్స్ నిర్మించబోతున్నట్లు ఓ టాక్ నడుస్తోంది. ఇలా 'ఫౌజీ' చిత్రంతో పాటు హను రాఘవపూడిపై కూడా ప్రభాస్ ఇంతలా నమ్మకం పెంచుకోవడంతో.. ఈ సినిమాతో ప్రభాస్‌కు భారీ విజయం దక్కడం ఖాయమని ఆయన అభిమానులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.



## 'ఒక్క కిస్ కూడా చేయలేదు'



కన్నడ స్టార్ హీరో యాష్ తాజాగా 'టాక్సిక్' చిత్రంలో హీరోగా నటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాను ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి అనేక ప్రచార చిత్రాలు విడుదలయ్యాయి. వాటిలో చాలా రొమాంటిక్ సన్నివేశాలు ఉండటంతో, ఈ చిత్రంలో అసభ్యకరమైన సన్నివేశాలు ఉన్నాయంటూ పెద్ద ఎత్తున ట్రోల్స్ వస్తున్నాయి. దీంతో తాజాగా యాష్ ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఓ టీవీ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినిమాలో వల్గారిటీ ఎక్కువగా ఉందంటూ వస్తున్న ట్రోల్స్‌పై ఆయన గట్టిగా స్పందించారు.

యాష్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో వల్గారిటీ ఏమాత్రం లేదు. కనీసం నేను ఈ సినిమాలో ఒక్క కిస్ కూడా చేయలేదు. దేనికైనా కచ్చితంగా ఒక హద్దు అనేది ఉంటుంది. అది మాకు బాగా తెలుసు. సినిమా షూటింగ్‌కు, స్క్రీన్‌పై కనిపించే దానికి చాలా తేడా ఉంటుంది. ఆ విషయం సినిమా చూసిన తర్వాత మీకు కచ్చితంగా అర్థమవుతుందని చెప్పుకొచ్చారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించగా, నయనతార, రుక్మిణి వసంత్, తారా సుతారియా కీలక పాత్రలు పోషించారు.

## యాడ్‌తో హీరోలకు చిక్కులు

మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ బాలీవుడ్ ప్రముఖ నటులు షారూఖ్ ఖాన్, అజయ్ దేవగణ్, టైగర్ ష్రాఫ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విమల్ ఇలాచ్చి యాడ్‌తో రాష్ట్రంలో నిషేధించబడిన విమల్ పాన్ మసాలా బ్రాండ్‌ను పరోక్షంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఈ నోటీసులు జారీ అయ్యాయి. కాగా, పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో గుట్కా, పొగాకు, నికోటిన్ కలిగిన పాన్ మసాలా విక్రయాలు, తయారీపై నిషేధం అమలులో ఉంది. విమల్ ఇలాచ్చి ప్రకటనల రూపం, డైలాగ్స్, బ్రాండ్ పేరు పాన్ మసాలాతో నేరుగా ముడిపడి ఉండటంతో ఇది పరోక్ష ప్రచారంగా పరిగణిస్తున్నామని ఎఫ్‌డీఏ చీఫ్ తుకారాం ముండే తెలిపారు.

భారీ జరిమానా పడే చాన్స్..

అయితే, నిబంధనలు ఉల్లంఘించి యాడ్ చేసినందుకు గాను షారూఖ్ ఖాన్, అజయ్ దేవగణ్, టైగర్ ష్రాఫ్‌లకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 24, 53 కింద ఈ నోటీసులు అందాయి. తప్పుదోవ పట్టించే ప్రకటనల్లో భాగమైనందుకు నిందితులకు రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. గతంలో ఇదే తరహా యాడ్‌పై తీవ్ర విమర్శలు రావడంతో నటుడు అక్షయ్ కుమార్ ఆ బ్రాండ్ ప్రకటనల ఒప్పందం నుంచి తప్పుకుని బహిరంగ క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన స్థానంలో టైగర్ ష్రాఫ్ సదరు యాడ్‌లోకి ఎంటరయ్యారు.




## సూర్య రికార్డుల వేట

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో మరోసారి నిరూపించారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా పాన్ ఇండియా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమా విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లను సాధించి అరుదైన రికార్డును సృష్టించింది.

ఈ చిత్రంలో సూర్య సరసన మమిత బైజు హీరోయిన్‌గా నటించగా, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై సూర్య సృష్టించిన ఈ సునామీ వసూళ్లతో ట్రేడ్ వర్గాలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం థియేటర్ల వద్ద 'బ్లాక్‌బస్టర్ విశ్వనాథ్ అండ్ సన్స్' జోరు కొనసాగుతుండటంతో చిత్ర యూనిట్ ఆనందంలో మునిగిపోయింది. త్వరలోనే ఈ సినిమా మరిన్ని రికార్డులను బ్రేక్ చేసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

